

# నా అనేవాళ్ళు

## జీడిగుంట నరసింహమూర్తి

శ్రీనివాసరావుగారి కుటుంబంలో ఆనందానికి పట్టపగ్గాల్లేవు. వాళ్ళ అమ్మాయికి పెళ్ళి సంబంధం కుదిరింది. అంతమాత్రానికే అలా విరగబడి ఆనందించటమేమిటి అని చాలామందికి ఆశ్చర్యం కలగక మానదు. ఈ రోజుల్లో కట్నం పారేస్తే పెళ్ళంత ఈజీ విషయం మరొకటుండదు. నాకు తెలిసిన శేషారావుగారు తన అయిదుగురు కూతుళ్ళ పెళ్ళి సునాయాసంగా చేసేశాడు. అయితే ఆయన ఉద్యోగంలో డబ్బు కూడా బాగానే సంపాదించుకున్నాడులెండి.

చివరి కూతురు పెళ్ళి జరుగుతున్నప్పుడు ఆయన ఆశ్చర్యపోయాడు నలుగురు కూతుళ్ళ పెళ్ళి తనే చేసానా అని. పెళ్ళి కొడుక్కి కావాల్సిన డబ్బు పారేయటం, వచ్చిన చుట్టాలతో పేకాడుకుంటూ ఎప్పుడో మధ్యలో ఒకసారి పురోహితుడు పిల్చినప్పుడు వెళ్ళడం తప్ప ఆయన టెన్షన్ పడింది ఎప్పుడూ లేదు. అసలు ఆయన పెళ్ళికూతురి తండ్రిగా ఎప్పుడూ ఫీల్ కాలేదు. హోటల్లో టిఫిన్ తిని బిల్ చెల్లించటం లాంటిదే ఈ పెళ్ళిళ్ళు అనుకునేవాడు.

అంతా డబ్బు మహిమ. ఒక్కొక్క పిల్లకి రెండేసి పురుళ్ళు కూడా సునాయాసంగా పోసేశాడు. పెళ్లి సంబంధాల కోసం చెప్పులు అరిగేలా తిరిగాం అంటుంటారు చాలా మంది ఆడ పిల్లల తండ్రులు కాని నాకు తెల్సిన సుదర్శనరావుగారు పిల్లలు పుడుతూనే వాళ్ళ పేరు మీద రెండేసి లక్షలకు ఇన్స్యూరెన్సు చేయించేసాడు. ఆ తర్వాత ఆ పిల్లలు పెద్దయ్యాక ఎడమ చేత్తో కట్నం విసిరేసి పెళ్ళిళ్ళు చేసేసాడు.

ఇంతకీ శ్రీనివాసరావు కుటుంబం ఆనందంలో మునిగి తేలటానికి కారణం చెప్పలేదు కదూ! వాళ్ళకు దొరికిన పెళ్ళి కొడుక్కి తల్లిదండ్రులుగాని, ఆడపడుచులుకాని, అన్నదమ్ములుగాని ఎవ్వరూ లేరంటే నమ్మండి. ఓహ్ ఎంతటి అదృష్టం! వాళ్ళు ఎన్ని వ్రతాలు చేశారో ఎన్ని గుళ్ళకు వెళ్ళారో కాని అదృష్టం వాళ్ళ కూతురిని వరించిందిట. శ్రీనివాసరావు భార్య జానకికి 'కంగ్రాచ్యులేషన్స్' అంటూ ఇరవైమంది మహిళా సభ్యురాండ్రు ఫోన్‌చేసి ఆవిడ అదృష్టాన్ని తెగపొగిడారు. మరో ప్రక్క వాళ్ళ కూతురు అలేఖ్య మిత్రురాళ్ళు ఇంటి మీదపడి అభినందనల వర్షం కురిపించారు. ఆమె అదృష్టానికి అసూయపడని వారులేరు.

అలేఖ్య చిన్నప్పట్నుంచి చాలా గారాబంగా పెరిగింది. ఎప్పుడూ వంట గదిలోకి వెళ్ళి ఎరుగదు. వంటల గురించి మాట్లాడటమంటే ఆమె విషయంలో 'అనాగరికత' క్రిందలెక్క. ఇంటికి ఎవరైనా వచ్చినా మంచినీళ్ళు

అందించటానికి కూడా ఆమెకు అంత ఇష్టం ఉండదు. తీరిక దొరికినప్పుడల్లా వీసీపీలో క్యాసెట్లు పెట్టుకుని ఎంజాయ్ చెయ్యటం తప్ప వేరే పనిలేదు. ఆమె ఎలా ప్రవర్తించినా కూడా తల్లిదండ్రులు పొంగిపోతూ కన్నడటం వాళ్ళింటికొచ్చిన బంధుమిత్రులకు ఎప్పుడూ ఆశ్చర్యాన్ని గొలుపుతూ ఉంటుంది.

● ● ● ●

"మీ మామగారికి, అత్తగారికి నమస్కారం చెయ్యమ్మా" అంటూ ఎవరో అంటుంటే అలేఖ్య ఆశ్చర్యపోయింది. "వదిన చాలా బాగుంది కదమ్మా!" అంది ఒకమ్మాయి తల్లితో ఆ పిల్ల అలేఖ్య ఆడపడుచు. ఇంటి పక్క ఎవరో చెపుతున్నారు. "అతనే పెళ్ళికొడుకు తమ్ముడు. ఈ సంవత్సరమే ఆ అబ్బాయి పెళ్ళి కూడా చేసేస్తారుట. అంటూ" అక్కడ చూసిన దృశ్యాలకు అలేఖ్య కళ్ళు తిరిగి పడిపోయింది. "మోసం! అంత వంచన" అంటూ గట్టిగా అరిచింది. శ్రీనివాసరావు, జానకి కంగారుగా అక్కడికి పరిగెత్తుకొచ్చారు. "ఏమయిందమ్మా ఏం జరిగింది?" అంటూ ఆమెను గట్టిగా కుదిపారు. "పీడ కలొచ్చిందమ్మా తల్చుకుంటేనే వెన్ను జలదరిస్తోంది. నాకు అత్తగారు, మామగారు, ఆడపడుచులు, మరదులూ అంతా ఉన్నట్టు కలొచ్చింది!" అంటూ వణుకుతూ చెప్పింది అలేఖ్య. "ఎందుకమ్మా అలా ఆలోచిస్తూ పడుకున్నావ్ వెధవ కలలు అలాగే వస్తాయి. ఉండు కాసిని మిరపకాయలు, ఉప్పు దిగదీస్తానంటూ వంటింట్లోకి పరిగెత్తింది జానకి. ఆ రాత్రంతా అలేఖ్యకు సరిగ్గా నిదురేలేదు.

అనుకున్నట్లే నెలరోజుల్లో అలేఖ్య పెళ్ళి జరిగిపోయింది. పెళ్ళి కొడుక్కి 'టూ బెడ్‌రూమ్ ఫ్లాట్' ఉంది. అందులో అందమైన రవివర్మ చిత్రాలు ఎక్కడ చూస్తే అక్కడ ఉన్నాయి. ఎందరో కళాకారులు నైపుణ్యంతో తయారుచేసిన అందమైన లోహాలతో చేసిన బొమ్మలున్నాయి. అవన్నీ చూస్తుంటే పెళ్ళికొడుకు కుమార్ సంస్కారాన్ని కళాత్మకతను తెలియచేస్తున్నాయి.

"అంకుల్ ఆంటీ మీరెప్పుడు రావాలనుకున్నా ఉత్తరం కూడా రాయకుండా వచ్చేయొచ్చు. ఇది మీ సొంత ఇల్లు అనుకోండి. ఇక మీ అమ్మాయి అలేఖ్య గురించి దిగులుపడాల్సిన అవసరంలేదు. ఆమెను పువ్వుల్లో పెట్టుకుని చూస్తాను" అని కుమార్ అంటుంటే శ్రీనివాసరావు, జానకిలు ఎంత ఆనందించారో వర్ణించి చెప్పలేము. ఊళ్ళవాళ్ళ చూపులన్నీ పడ్డాయని వాళ్ళిద్దరికి కొబ్బరికాయ దిగతుడిచి అవతల పారేసింది జానకి. "ఆయనెంతో మంచివారు. నన్నెంతో బాగా చూసుకుంటారు. రెండు నెలల నుండి ఇంట్లో అన్నం వండుకోవటం లేదు. బియ్యం కూరలూ కూడా కొనుక్కోలేదు. మా భోజనం అంతా ఫైవ్ స్టార్ హొటల్లోనే. అమ్మా నేనెంతో అదృష్టం చేసుకున్నాను. మీ కూతురిగా పుట్టినందుకు ఎంతో గర్విస్తున్నాను. మా ఇంట్లో ఆంక్షలులేవు. అడ్డులేదు. విసిగించే వాళ్ళులేరు. శాసించేవాళ్ళు లేరు. ఇలాంటి జీవితం ఎంతమందికుంటుంది చెప్పు? హాయిగా ఆయనొచ్చేంత వరకు పుస్తకాలు చదువుతూనే, టీవీ చూస్తూనే గడిపేస్తాను. నాకిప్పటికీ ఇదంతా ఒక కలలా అనిపిస్తుంది. మీరిద్దరూ వచ్చి ఒక నెలరోజులు మాతో గడపరాదూ! నాన్నను సెలవు పెట్టేయమని చెప్పు.... ఉత్తరం చదువుకున్న జానకి, శ్రీనివాసరావులు ఆనందంగా పొంగిపోయారు. ఒక వారం రోజులు సెలవు పెట్టి వెళ్ళాలనుకుంటూనే ఐదునెలలు గడిపేసాడు శ్రీనివాసరావు. అసలు వెంటనే వెళ్ళి కూతుర్ని అల్లుడిని డిస్టర్బ్ చేయటం కూడా ఇష్టం లేదు.

● ● ● ●



"నీ కష్టాల్లో నేనూ భాగం పంచుకుంటాను రఘూ" అంది గీత!!
"నాకు ఏ కష్టాలు లేవు" అన్నాడు!
"ఇప్పుడు లేవులే పెళ్లి అయ్యాక వస్తాయి కదా"
అయితే నేను పెళ్లే చేసుకోనుగా!

డి. శ్రీధర్
కొండాపురం

అనుకోకుండా మద్రాస్ క్యాంపు పడటంతో కూతురింటికి వెళ్ళి నాలుగు రోజులు ఉండొచ్చని అనుకున్నాడు శ్రీనివాసరావు. వస్తున్నట్లు ఫోన్ చేసాడు. రైల్వే స్టేషన్‌కు అలేఖ్య వచ్చింది. "ఏమ్మా నువ్వొక్కత్తివేవచ్చావ్ అల్లుడుగారు రాలేదే?" అని అడిగింది జానకి. భర్త క్యాంపుకెళ్తుండటంతో నేనూ వస్తాను అంటూ బయలుదేరింది జానకి.

"ఆయన వేరేపనిలో బిజీగా ఉన్నారు. నన్నెళ్ళి రిసీవ్ చేసుకోమన్నారు. అయినా ఇప్పుడు మద్రాసంతా నాకు కొట్టినపిండే!" అంది నవ్వుతూ అలేఖ్య.

జానకి కూతురితో కూర్చుని కబుర్లు చెపుతోంది. శ్రీనివాసరావుకే ఏమీతోచటంలేదు. ప్రయాణపు బడలిక వల్ల అతనికి నిద్ర ముంచుకొచ్చేసింది. ఒక గంట తర్వాత అతనికి మెలకువ వచ్చేసరికి అల్లుడు కుమార్ గదిలోంచి మాటలు వినబడుతున్నాయి. "మీ చుట్టాలెవరో వచ్చారు గదా ఏదైనా హొటల్లో తినుకుందామా కుమార్?"

"అలాంటి ప్రాబ్లెమ్ ఏమీ ఉండదు రఘూ! మన అలవాట్లు మా ఆవిడ ఈపాటికి వాళ్ళకి అర్థమయ్యేటట్లు చెప్పేఉంటుంది. కమాన్ ఆ ఓపెనర్ అందుకో..." అన్నాడు కుమార్. శ్రీనివాసరావుకు నిద్రమత్తు పూర్తిగా వదిలిపోయింది. కుమార్ గదిలోకి ఎవ్వరూ వెళ్ళ కూడదన్న నిబంధన ఉన్నట్లు తెలుసుకున్న అతను లోపలికి దూసుకుపోవాలన్న ఆలోచనకు బ్రేక్ వేశాడు. ఈ లోపు అటుకులు వేరుశనగపప్పు వేయించి తీసుకొచ్చి అందించింది జానకి. శ్రీనివాసరావుకు ఒక్కపలుకు కూడా లోపలికి పోలేదు. ఈ రోజుల్లో మందు పుచ్చుకోవడం, ఫ్రెండ్స్‌ను ఇంటికి తీసుకొచ్చి తాగించటం సిటీ లైఫ్‌లో మామూలే అయినా ఎందుకో శ్రీనివాసరావుకు ఈ పద్ధతి రుచించలేదు. ఇంకో గంటయ్యేసరికి కుమార్ గది తలుపు తెరుచుకుంది. అందులోంచి నలుగురైదుగురు బయటకు తూలుతూ వచ్చి వెళ్ళిపోయారు.

"ఏం మామగారూ బాగా నిద్రపట్టిందా?" అడిగాడు కుమార్. "అవును. అన్నట్లు నువ్వెప్పుడేనా రావటం?" అన్నాడు ఏమీ ఎరగనట్లు. ఆ తర్వాత తన క్యాంపు గురించి మూడు ముక్కల్లో మాట్లాడాడు. కుమార్ 'ఊ' అంటున్నాడే తప్ప ఎక్కువగా మాట్లాడలేదు. 'అసలు ప్రపంచంలో అల్లుడు మామతోను, మామ అల్లుడితోనూ పెద్దగా మాట్లాడుకునే విషయాలు ఏం ఉంటాయి?' అన్నట్లుగా ఉంది అక్కడి పరిస్థితి.

మర్నాడు ఉదయం శ్రీనివాసరావు అతని పనిమీద బయటకు వెళ్ళిపోయాడు. సాయంత్రం తిరిగి వచ్చాక ఇంకా అల్లుడు రాలేదని తెల్సింది. రాత్రి బాగా పొద్దుపోయేసరికి కుమార్ వచ్చి పడుకున్నాడు. జానకి భోజనం చెయ్యమని చెప్పినా బయట ఫ్రెండ్స్‌తో అయిపోయిందన్నాడు. అలేఖ్య తనతో ఏమీ చెప్పలేదుకాని అల్లుడి పరిస్థితి చాలా అనుమానాస్పదంగా ఉంది. కూతురు తల్లితో కబుర్లు చెప్పుతున్నా అవి కృత్రిమంగా అనిపిస్తున్నాయి. ఏదిఏమైనా తాము వెళ్ళిపోయేలోపు ఒక భయంకరమైన నిజం తెల్సుకోవాల్సి వస్తుందేమో - అనుకుంటూ తీవ్ర మనస్తాపం పొందాడు శ్రీనివాసరావు.

ఆ రోజు రాత్రి రావటంలేదని మెసేజ్ అందింది కుమార్ నుండి. పోనీ అతనికేమైనా బిజినెస్ ఉండి ఇలా వేళలు తప్పటానికి అనుకుందామా అంటే అదీలేదు. అతనొక పెద్ద కంపెనీలో ఆడిటర్. ఎంత బిజీగా ఉన్నా రాత్రుళ్ళు బయట ఉండిపోవడం అంటూ జరగదు. మరేమిటి రహస్యం? వంట కార్యక్రమం పూర్తయ్యాక ముగ్గురూ ఒక చోటచేరారు. "నాన్నా ఆయన ప్రవర్తనలో మీకు మార్పు కనిపిస్తోందా? అడిగింది హఠాత్తుగా అలేఖ్య. "పెళ్ళికి ముందు అతని ఉద్యోగం, హొదా మాత్రమే మాకు తెలుసు. అప్పటి ప్రవర్తన మాకు తెలియదు. పెళ్ళయిన తర్వాత మేము ఇదే రావటం. కాని ఇప్పటి ప్రవర్తన మాత్రం మాకు అనుమానంగానే ఉంది." అన్నాడు శ్రీనివాసరావు.

"నాన్నా మీదగ్గర ఏ విషయం నేను దాచదల్చుకోలేదు. ముందు నుంచి ఆయన తాగుడికి బానిస. ఆ విషయం పెళ్ళికి ముందు మనకెవరికి తెలియదు. ఈ ఊళ్ళో ఆయనకులేని అప్పుల్లేవు. ఫ్రెండ్స్‌కు అప్పులిప్పించడం, హామీలు ఇవ్వటం చివరకు వాళ్ళు ఎగ్గొట్టి ఈయన మీద వెయ్యటం చాలాకాలం నుండి జరుగుతోందిట ఇప్పుడు ఆయనకు రెండు లక్షలుపైగా అప్పు ఉంది. ఇంటికి వచ్చే అప్పులవాళ్ళను ఏవో మాయమాటలు చెప్పి వాళ్ళను తాగించి రోజులు లాక్కుంటూ వస్తున్నారు ఇల్లేనా సొంతం అని అనుకున్నా ఆ ఆశ కూడా ఆయన నిలవనివ్వలేదు. దీన్ని కూడా తాకట్టు పెట్టారుట. ఆయన నన్ను ఒక్కమాట కూడా అనరు. ఎంతో ప్రేమగా చూసుకుంటారు. అప్పుల విషయం తెలుసుకుని అడిగితే నువ్వేం వర్రీ కాకంటారు. అసలు ఈయనకు చిన్నప్పట్నుంచి నా అనేవాళ్ళు లేకపోవటం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. అడిగేవాళ్లు లేరు. మందలించేవాళ్లు లేరు. ఆయన తప్పుల్ని గమనించేవాళ్లు లేరు. నాకిప్పుడు అనిపిస్తోంది ఆయనకు తల్లిదండ్రులూ, అన్నదమ్ములూ ఉంటే ఇలా తయారవ్వకుండా ఉండేవారేమో. ప్రక్కింటి లాయర్‌గారి భార్య ఒక్కొక్క విషయం చెవుతూంటే నా గుండె బలహీనమైపోతోంది. రోజూ కుమిలిపోవటం తప్ప నేనేమీ చెయ్యలేకపోతున్నాను" అంది ఏడుపునాపుకుంటూ అలేఖ్య.

"అవునమ్మా. మనం ఎంతమటుకు తల్లిదండ్రులుండకూడదు. అక్క చెల్లెళ్ళుండకూడదు అని అనుకుని అలాంటి సంబంధం వచ్చాక మురిసి ముక్కలైపోయాం. ఉమ్మడి కుటుంబం కాకపోయినా ఈ రోజుల్లో 'తన' అని అనుకునేవాళ్లుండాలి. ఇంటికి నలుగురు 'నా అన్నవాళ్ళు' వచ్చి పోతుంటే ఆ సంసారంలో ఒడిదుడుకులు మాయమైపోతాయి. అమ్మాయి పెద్ద కుంటుంబంలో పడింది అని బాధపడ్తారేతప్ప ఆ కుటుంబంలో పెద్దలు ఉంటే ఓ రకంగా ఎంతమంచిది అని అర్థమవుతుంది మీ ఆయన పరిస్థితి చూస్తుంటే. అయినా నువ్వేం బాధపడకు. ఇందులో నీ ప్రమేయం లేదు". అన్నాడు ఆమె తల నిమురుతూ శ్రీనివాసరావు.

"నాన్నా తల్లిదండ్రులులేని ఆయనకు మీరే తల్లిదండ్రులై ఆయన్ని కాపాడరూ?" అంది అలేఖ్య తండ్రి చేతులు పట్టుకుని. శ్రీనివాసరావు గుండె జాలితో నిండిపోయింది. "సమస్యలు అవే సర్దుబాటవుతాయి నువ్వేం ఆలోచించకపడుకో. పరిష్కారమార్గం నేనాలోచిస్తాను" అంటూ అలేఖ్యకు హామీ ఇచ్చాడు శ్రీనివాసరావు.

●